1947 లో రాజకీయాల గురించి రాయాలంటే అప్పటిదాకా అధికారంలో వున్న వారి గురించి చెప్పాలి కదా. పెరియార్, అణ్ణాదురైల గురించి రాసినపుడు రాజాజీకి వ్యతిరేకంగా.. అంటూ కాస్త కాస్త రాశాను. అసలు రాజాజీ ఎవరో తెలిస్తేనే కదా ఆయనది రైటో, వీళ్లది రైటో మనం ఒక అభిప్రాయానికి రాగలిగేది? అందువలన కొద్దిగానైనా అప్పటి రాజకీయ నేపథ్యం రాయాలి.

బ్రిటిషు వారు తమకి వ్యతిరేకంగా వలసరాజ్యాలలో ఆందోళనలు జరగడం గమనించారు. మొదటి ప్రపంచయుద్ధం (1914-1918) తర్వాత వాళ్లు తమ ఏలుబడి ప్రాంతాలలో స్థానికులను యిన్‌వాల్వ్‌చేస్తూ బాధ్యతాయుత ప్రాతినిధ్య ప్రభుత్వాల ఏర్పాటుకు అవసరమైన సంస్కరణలు (మాంటేగ్-ఛెమ్స్‌ఫర్డ్ సంస్కరణలు అన్నారు వీటిని) ప్రవేశపెట్టారు. ఈ లోగా భారతీయులను వాళ్లని వాళ్లే పరిపాలించుకోనివ్వాలని లోకమాన్య తిలక్, అనీ బిసెంట్ 'హోం రూల్' ఉద్యమం నడిపారు. దానిపై 1919 ఇండియా చట్టం పాస్ చేసి రాష్ట్రాలకు స్వాతంత్ర్యాధికారాలు కల్పించారు.

స్థానిక పరిపాలన, ప్రజారోగ్యం, విద్య, పోలీసు వుంటి ప్రాంతీయ ప్రాముఖ్యం వున్న శాఖల అజమాయిషీ రాష్ట్రప్రభుత్వాలకు దక్కింది. విదేశీ వ్యవహారాలు, రైళ్లు, తంతి తపాలా, ఆదాయపు పన్ను వంటివి కేంద్రప్రభుత్వం తన అధీనంలో వుంచుకుంది. రాష్ట్ర పరిధిలోని కొన్ని శాఖలను రిజర్వ్ చేసి గవర్నరు (బ్రిటిష్‌వాడే) వాటికి మంత్రులను నియమిస్తాడు. తక్కిన శాఖలను ట్రాన్స్‌ఫర్డ్ అన్నారు. వాటికి రాష్ట్ర కౌన్సిల్‌కు మూడేళ్లకు ఓ సారి ఎన్నికలు నిర్వహించి నెగ్గినవారిలో కొందర్ని గవర్నరు ఎన్నుకుంటాడు. ఇలా భారతీయులకు పరిపాలన అప్పగించి పైనుండి వాళ్లు పర్యవేక్షిస్తారన్నమాట. ఆ విధంగా స్వాతంత్ర్యకాంక్షను కాస్త తగ్గిద్దామని వాళ్ల ప్రయత్నం. మనకు యిష్టం వచ్చినవాళ్లను ఎన్నుకునే హక్కు కూడా యిచ్చారుగా, ఎలాగూ మనవాళ్లేకదా పరిపాలిస్తున్నది అని మనం అనుకుని వూరుకుంటామని వాళ్ల ఆశ.

కాంగ్రెస్ అప్పట్లో సహాయనిరాకరణ చేస్తోంది కాబట్టి 1919 రాష్ట్ర కౌన్సిళ్ల ఎన్నికలలో పాల్గొనలేదు. కానీ ఆంగ్లేయులకు అనుకూలురైన జస్టిస్ పార్టీ మాత్రం పోటీ చేసింది. 1920 డిసెంబర్ 17 న మద్రాసు ప్రెసిడెన్సీకి ముఖ్యమంత్రిగా (అప్పట్లో ప్రధానమంత్రి అనేవారు) కడలూర్ వాస్తవ్యుడైన ఎ సుబ్బరాయలు రెడ్డియార్ ప్రమాణస్వీకారం చేసి 7 నెలలు పాలించారు. అనారోగ్య కారణాల వలన రాజీనామా చేస్తే ఆయన స్థానంలో పానగల్లు రాజా - రాజా రామాయణి వచ్చారు. 1923 ఎన్నికలలో నెగ్గి అదే పదవిలో చనిపోయేదాకా కొనసాగారు. మొత్తం ఆయన పాలన 5 ఏళ్ల 5 నెలలు.

1927 ఎన్నికలలో కాంగ్రెస్ పాల్గొని 42 స్థానాలు గెల్చుకుంది. జస్టిస్ పార్టీకి 16 వచ్చాయి. అయితే తమపై గవర్నరు అజమాయిషీ యిష్టం లేని కాంగ్రెస్ తాము మంత్రివర్గం ఏర్పాటు చేయం అని తిరస్కరించింది. అప్పుడు కౌన్సిల్‌లో ముఖ్యుడైన సిపి రామస్వామి అయ్యర్ జస్టిస్ పార్టీకి చెందిన డా॥ సుబ్బరాయన్ ఆధ్వర్యంలో జాతీయ ప్రభుత్వం ఏర్పాటు చేయించాడు. కాంగ్రెస్ దీనికి బయటి మద్దతు అందించింది. ఇది మూడేళ్లు నడిచింది. 1929లో ఉప్పు సత్యాగ్రహం పేరుతో కాంగ్రెస్‌వారు ప్రభుత్వానికి తమ మద్దతు ఉపసంహరించుకున్నారు.

అప్పుడు పి ముత్తుస్వామి నాయుడు జస్టిస్ పార్టీ అధ్యక్షుడై ముఖ్యమంత్రి అయ్యాడు. తన రెండేళ్ల పాలనలో రైతులకు మేలు చేకూర్చడానికి ఎస్టేటు లాండ్స్ యాక్ట్‌ను సవరించి జమీందార్ల ఆగ్రహానికి గురయ్యాడు. దాంతో జమీందార్లంతా అతన్ని దింపి బొబ్బిలి రాజా రామకృష్ణ రంగారావును గద్దెపైకి ఎక్కించారు. అతను దాదాపు నాలుగేళ్ల పాటు పాలించాడు. ఆ తర్వాత పి టి రాజన్ (4 నెలలు), మళ్లీ బొబ్బిలి రాజా (8 నెలలు), కూర్మా వెంకట రెడ్డి నాయుడు (3 నెలలు) ముఖ్యమంత్రులుగా వున్నారు. (వీళ్లలో చాలామంది తెలుగువాళ్లు వున్నట్టు గమనించి వుంటారుగా !)

1937 ఎన్నికలలో జాతీయ పార్టీల నాయకులు పోటీకి నిలబడటంతో జస్టిస్ పార్టీవాళ్లు చిత్తుగా ఓడిపోయారు. జస్టిస్ పార్టీ జమీందార్ల పార్టీ. వాళ్లు ఓటర్లజాబితాను యిష్టం వచ్చినట్టు మార్చేసేవారు. తమకు అనుకూలంగా అసెంబ్లీ స్థానాలను నిర్ణయించుకున్నారు. వారి ప్రభుత్వాలపై బ్రిటిషువారి పెత్తనమే వుండేది. 1937లో కాంగ్రెస్ పార్టీకి మద్రాసు శాసనసభలో 215 స్థానాల్లో 160 స్థానాలు వారికి దక్కాయి. అప్పట్లో కాంగ్రెస్ నాయకులలో ప్రముఖులు తెలుగువారిలో ప్రకాశం, తమిళులలో రాజాజీ. ముఖ్యమంత్రి ఎవరవుతారా అందరూ ఉత్కంఠతో చూశారు. ప్రకాశంగారే రాజాజీ పేరు ప్రతిపాదించారు. ఆ విధంగా 1937లో రాజాజీ ముఖ్యమంత్రి అయ్యారు. ఆయన ప్రకాశం గారిని తన డిప్యూటీ లీడరుగా తీసుకుంటారని అంతా అనుకున్నారు. అయితే ఆయన యిద్దరు డిప్యూటీలను వేసుకుని, ఒకటి ప్రకాశంగారికి, మరొకటి వేదరత్నం పిళ్లయ్ అనే తమిళుడికి యిచ్చారు.

ప్రకాశంగారు తనతో పాటు బులుసు సాంబమూర్తిగారు మంత్రిగా వుంటే బాగుంటుందనుకుంటే, యిద్దరూ కలిసి బలపడతారనే సంకోచంతో రాజాజీ ఆయన్ను స్పీకరుగా చేశారు. పోనీ వివి గిరి (కోస్తా), కడప కోటిరెడ్డి (రాయలసీమ) లను మంత్రులుగా వేయండంటే గిరికి, యిచ్చి కోటిరెడ్డి బదులు మరొకర్ని సూచించమన్నారు. విధిలేక బెజవాడ గోపాలరెడ్డి పేరు చెప్పారు. ఆయనది నెల్లూరు. ఆ విధంగా రాయలసీమకు ప్రాతినిధ్యం లేకుండా చేసి పైగా రాయలసీమ నాయకులతో ప్రకాశమే నెల్లూరు వాణ్ని ప్రతిపాదించాడు అని చెప్పి కోస్తా, సీమ నాయకుల మధ్య విభేదాలు పెంచాడు.

ఇలా ప్రకాశంగారి విలువ తగ్గిస్తూ ఆంధ్ర నాయకుల మధ్య విభేదాలు పెంచుతూ కుటిల రాజకీయాలు నడిపారు రాజాజీ. తెలుగువారిలో రాజాజీని అభిమానించేవారు అతి తక్కువ. రాజాజీ ప్రవేశ పెట్టిన కొన్ని చట్టాలను వ్యతిరేకించే పెరియార్ ప్రాచుర్యంలోకి వచ్చారు. మద్రాసు ప్రెసిడెన్సీ రాజకీయాలపై రాజాజీ ప్రభావం చాలా వుంది. అంతేకాదు, ఈయన జాతీయస్థాయిలో కూడా లీడరై,

ప్రప్రథమ భారతీయ గవర్నరు జనరల్ అయ్యారు. గాంధీగారితో వియ్యం కలిపి, నెహ్రూతో స్నేహం నెరపి, తన మేధోశక్తితో జాతీయస్థాయిలో తెలుగు ప్రాంతాలకు అన్యాయం చేసిన ఈ కౌటిల్యుడి నేపథ్యం ఏమిటి? ఆయన కథ తెలుసుకుందాం వచ్చే శుక్రవారం నుండి. (సశేషం) – **ఎమ్బీయస్ ప్రసాద్ (సెప్టెంబరు 2011)**